చివరిలో కలవరం

- తుఫాన్ ప్రకటన నేపథ్యంలో ఆందోళనలో రైతాంగం
- మాసూళ్లు వాయిదా వేసుకోవాలని అధికారుల సూచన
- ఆఫ్‌లైన్ విక్రయాలకు కూడా లైన్‌క్లియర్


పెనుగొండలో బరకాలతో ధాన్యం రాశులను కప్పుతున్న రైతులు

పెనుగొండ: తుఫాన్ ప్రకటన నేపథ్యంలో వరి పంట చివరి దశలో రైతులు కలవరపడుతున్నారు. ఆరుగాలాల పాటు కష్టపడి పండించిన పంటను రక్షించుకోడానికి రైతులు, వారికి అండగా ఉండడానికి అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం సాయంత్రానికి రైతన్నల వద్ద ఉన్న ధాన్యం నిలువలను రైసు మిల్లులకు తరలించడానికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ఆన్‌లైన్‌కు చెక్ చెప్పి, ఆఫ్‌లైన్‌లోనూ తరలించడానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో రైతులు ధాన్యాన్ని త్వరగా మిల్లులకు చేర్చుకోవాలంటూ సూచనలు చేస్తున్నారు. జిల్లాలో శనివారం సాయంత్రానికి సుమారు 15 వేల మెట్రిక్ టన్నులు ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేశారు. వీటిలో అగ్రస్థానం స్వర్ణ ఉండగా, రెండవ స్థానంలో ఎంటీయూ 13418 రకం ఉంది.అయితే తుఫాన్ స్వర్ణ రకంపైనే అధికంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే స్వర్ణ పండించిన రైతులు దాదాపుగా 80 శాతంకు పైగా మాసూళ్లు పూర్తి చేసి ఆర్‌బీకేల ద్వారా రైసు మిల్లులకు చేర్చారు. స్వర్ణలు తుఫాన్లకు, ఈదురు గాలులకు పడిపోయే గుణం ఉండడంతో అధికారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. మిగిలిన ఎంటీయూ 1318 రకం మరికొద్ది రోజులు ఆగినా ఇబ్బంది ఉండకపోవచ్చునని అంచనా వేస్తున్నారు. శనివారం సాయంత్రానికి జిల్లాలో కోతలు కోసి, మాసూళ్లు పూర్తయిన కళ్లాల్లో 15 వేల మెట్రిక్ టన్నులు ఉంటాయని అధికారులు అంచనా వేయడంతో ఆర్‌బీకేల ద్వారా రైతులకు త్వరగా ఒబ్బిడి కావాలని సూచనలు చేస్తున్నారు. దీంతో పాటు ఆన్‌లైన్‌ను వదిలి, దగ్గరలో ఉన్న రైసుమిల్లులకు చేర్చుకొనే సానుకూలతను ప్రభుత్వ కల్పించిందని సూచిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కోతలను వాతావరణం అనుకూలంగా మారేవరకూ వాయిదా వేసుకోవాలని సూచించారు.

వరికోతలు వాయిదా వేసుకోవాలి

యలమంచిలి: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరికోతలను నాలుగు రోజులపాటు వాయిదా వేయాలని యలమంచిలి వ్యవసాయాధికారి చిండులూరి దేవి కోరారు. యలమంచిలి మండలంలో సార్వాసీజన్‌లో 4886 ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటివరకు 98 ఎకరాల్లో మాత్రమే కోతలు పూర్తయినట్లు వ్యవసాయాధికారి దేవి తెలిపారు.

ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

పోడూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను కారణంగా ఆదివారం సాయంత్రం నుంచి భారీ వర్షాలు కురుస్తాయనీ, రైతులు ముందు జాగ్రత్తగా కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు లేదా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు సూచించారు. కవిటం, జగన్నాథపురం, పండితవిల్లూరు గ్రామాల్లో శనివారం ఆయన వ్యవసాయాధికారి జి.సత్యనారాయణతో కలిసి పర్యటించారు. వ్యవసాయాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 13 వేల ఎకరాల్లో సార్వా వరిసాగు చేయగా ఇప్పటివరకు 2350 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, 2578 టన్నుల ధాన్యం మిల్లులకు వెళ్లిందనీ, కల్లాల్లో దాదాపు 1500 టన్నుల ధాన్యం ఉంటుందని తహసీల్దార్ కృష్ణారావుకు వివరించారు. రాగల కొద్దిగంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులంతా కళ్లాల్లో ఉండిపోయిన ధాన్యాన్ని మిల్లులకు గాని, సురక్షిత ప్రాంతాలకు గాని తరలించాలని చెప్పారు. మరో 4 రోజులపాటు రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు.

పెనుమంత్రలో జేసీ పర్యటన

పెనుమంత్ర: మండలంలోని భట్లమగుటూరు, శ్రీరామపురం, ఆలమూరు గ్రామాల్లో ఆరబోసిన ధాన్యాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామసుందరరెడ్డి పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు, తుఫాన్ హెచ్చరికలు నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. రైతులు ధాన్యంలో 20 నుంచి 21 శాతం తేమ ఉన్నప్పటికీ సంబంధిత ఆర్‌బీకేల ద్వారా అమలులో ఉన్న మార్గదర్శకాలకు లోబడి అమ్మకాలు జరపవచ్చని ఆయన సూచించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరికోతలు నాలుగు రోజుల పాటు వాయిదా వేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్‌వర్మ, ఎంపీడీఓ పి.పద్మజ, ఏఓ ఎ.జోషుల తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం మండలంలో...

నరసాపురం రూరల్: తుఫాన్ ప్రభావంతో తీరప్రాంతంపై అధికంగా ఉండవచ్చని అంచనా ఈ నేపథ్యంలో శనివారం నరసాపురం తీరంలో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారడం ఈదురుగాలులు వీచాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో వివిధ దశల్లో వరిపంటను ఒబ్బిడి చేసే పనుల్లో రైతులు తలమునకలయ్యారు. ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. వ్యవసాయ శాఖ ఏడీ ఈదా అనిల కుమారి, ఏఓ రాజశేఖర్ నేతృత్వంలో బృందాలుగా గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటించి రైతులకు సూచనలు చేశారు.


పెనుగొండ: పాలమూరులో హడావిడిగా మాసూళ్లు చేస్తున్న రైతులు


యలమంచిలి: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి దేవి


పెనుమంత్ర: ఆలమూరులో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జేసీ రామసుందరరెడ్డి


నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

క్లుప్తంగా

గరుడవాహనంపై వేములదీవి వెంకన్న


గరుడవాహనంపై సీతారాముల అలంకరణలో దర్శనమిస్తున్న వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం పర్వదినం త్రయోదశి కావడంతో గరుడ వాహనంపై సీతారాముల అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారిని అలంకరించారు. ప్రత్యేకంగా స్వామి వారిని శ్రీరాముడిగా పూలతో ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయంలో ప్రత్యేక పూజలు


యాళ్లవానిగరువులో పూజలు చేస్తున్న శ్రీహరి గోపాలరావు దంపతులు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం యాళ్లవానిగరువులో వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) నిర్మించారు. ఈ కార్యాలయంలో శనివారం గుడాల గోపి–మంగతాయారు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివదేవునిచిక్కాల సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు ర్యాలి శివరామకృష్ణప్రసాద్ (సిద్ధాంతి) బ్రహ్మత్వంలో పూజలు, హోమం నిర్వహించారు. గోపి కుటుంబ సభ్యులు, బంధువులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దేవాంగుల సంక్షేమానికి కృషి


కొడమంచిలిలో వట్టి ముత్యాలు దంపతులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

పెనుగొండ: దేవాంగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శనివారం కొడమంచిలి పవర్ పేటలో నిర్వహించిన దేవాంగుల కార్తీక వన సమారాధనలో పాల్గొని దేవాంగుల కుల పెద్ద వట్టి ముత్యాలు(80), సరస్వతి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవాంగుల సంఘ జిల్లా కోశాధికారి అల్లాడ కుమారస్వామి, ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి బేబీ రాజేష్, ఉప సర్పంచ్ ములగాడ వరప్రసాద్, రైతు సంఘ అధ్యక్షుడు మన్నే సుబ్బారావు, దేవాంగుల సంఘ నాయకులు మావూరి నాగరాజు, మల్లిపెద్ది నాగయ్య, మల్లిపెద్ది అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా లక్షపత్రి పూజలు


లక్షపత్రి పూజలు చేస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి లక్షపత్రి పూజ ఏర్పాటు చేశారు. పురోహితులు ఈరంకి కాశీ బ్రహ్మత్వంలో కార్తీకమాసం నెలవారీ పూజలు చేయించుకునే భక్తులతో ఈ పూజా కార్యక్రమాలు జరిపించారు. స్వామివారికి లక్షపత్రి పూజ అనంతరం లక్ష్మీపార్వతి అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 10 మంది ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం కళాశాల ఆవరణలో హెటిరో డ్రగ్స్ ఫార్మా కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తమకు వచ్చే ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరైన విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ లెర్నింగ్ ప్రొఫెసర్ బి.ఆండాళ్లు, జేకేసీ కో‌ఆర్డినేటర్ కె.భద్రాచలం, డాక్టర్ వి.యామిని, జేకేసీ ట్రైనర్ ఎం.కిరణ్‌కుమార్, పి శ్రీనివాసరావు, హెటిరో హెచ్‌ఆర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు


పాలకొల్లు అర్బన్: దగ్గులూరులో మాట్లాడుతున్న పెదపాటి పెద్దిరాజు

పాలకొల్లు అర్బన్: జగనన్న కాలనీలకు రోడ్లు, డ్రెయిన్‌లు, మంచినీరు తదితర వసతులను ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్నట్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు చెప్పారు. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామ సచివాలయంలో హౌసింగ్ డే సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదేశాల మేరకు శనివారం లబ్ధిదారులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. హౌసింగ్ ఏఈ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ దగ్గులూరులో 74 మందికి ఇంటి స్థలాలు ఇవ్వగా వారిలో 34 మంది గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని, 8 మంది శ్లాబులు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 6 గురు శ్లాబు లెవిల్‌కి కట్టుబడి పూర్తి చేశారని, 18 మంది పునాదుల స్థాయిలో ఉన్నట్లు వివరించారు. ఉపసర్పంచ్ విశ్వనాథం పేరయ్య, పంచాయతీ కార్యదర్శి ఎస్ఎన్‌వీ మల్లేశ్వరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తోట విశ్వ చైతన్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు చలపతిరావు, పల్లపురాజు పాల్గొన్నారు.

కవిటంలో..

పోడూరు: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే పేదల సొంతింటి కల నెరవేరుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా కవిటం గ్రామంలో ఉత్తరపేట ప్రాంతంలోని జగనన్న కాలనీని శనివారం ఆయన సందర్శించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణ వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. 271 లబ్ధిదారుల్లో 78 మంది ఇళ్లు నిర్మించుకున్నారనీ, 89 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయనీ, 104 మంది లబ్ధిదారులు ఇళ్లనిర్మాణం ప్రారంభించాల్సి ఉందని అధికారులు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరాజుకు వివరించారు. ఆయన వెంట ఆర్ఐ కె.రాంబాబు, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ వి.జయరాజు ఉన్నారు.

ఓటు హక్కు నమోదు చేయించుకోవాలి


పీఎల్‌కే స్కూల్లో 87, 88 బూత్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ శేషాద్రి

పాలకొల్లు సెంట్రల్: ఓటర్లు తమ ఓట్లను నమోదు చేయించుకోవాలన్నా, సవరణ చేయించుకోవాలన్నా నేటితో గడువు ముగియనుందని మునిసిపల్ కమిషనర్ బిఆర్ఎస్ శేషాద్రి తెలిపారు. శనివారం స్థానిక పీఎల్‌కే ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 87,88 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ శేషాద్రి మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఉన్న 72 నుంచి 120వ బూత్‌ల వరకూ బీఎల్ఓలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తమ విధులు నిర్వహించారన్నారు. ఈ రోజు ఫారం–6 ద్వారా 18 ఏళ్ల వయస్సు నిండిన నూతన ఓటర్లు 115 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే ఫారం–7 ద్వారా 48 మంది ఓట్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దరఖాస్తులు చేశారన్నారు. ఫారం–8 ద్వారా సవరణ చేసుకోవడానికి 121 మంది ఓటర్లు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఓట్లు నమోదు, సవరణ చేసుకునే అభ్యర్థులు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారి వీరబ్రహ్మం, వైఎస్సార్ పార్టీ మీడియా కోఆర్డినేటర్ బాకూరి నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లు పరిశీలన

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో శనివారం పోలింగ్ బూత్‌లను అధికారులు పరిశీలించారు. పోలింగ్ జరిగే బూత్‌ల్లో ఇంటర్‌నెట్, సీసీ కెమెరాలు ఏర్పాటు, మంచినీటి సదుపాయం, వికలాంగులకు, వృద్ధులకు ర్యాంపులు ఏర్పాటు అందుబాటులో ఉన్నాయా? లేదా? అని బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు, తహసీల్దారు ఎన్.గురుమూర్తి రెడ్డి, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస దొర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి, ఆర్ఐ కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు సత్కారం


మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న పోడూరు కాపు సంఘం నాయకులు

పోడూరు: పోడూరు గ్రామంలో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి రూ.25 లక్షలు నిధులు మంజూరు చేసిన సందర్భంగా మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును శనివారం కాపు సంఘం నాయకులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిని, సొంతఖర్చులతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, చేకూరి సూరిబాబు, సొసైటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, దేవస్థానం చైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, కాపు సంఘం అధ్యక్షుడు అడపా శంకర్, జడ్డు చిన జోగేశ్వరరావు, రాయుడు నాగరాజు, ఉగ్గిరాల కాశయ్య, రేకపల్లి నాగరాజు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కారానికే ప్రాధాన్యత

పెనుగొండ: గ్రామాల్లో మురుగు సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత నిస్తున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. శనివారం ఆచంట పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో నిర్మించిన డ్రెయినేజీ నిర్మాణాన్ని పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా సమస్య మారిన మురుగు డ్రెయిన్‌కు మోక్షం కల్పించారని కాలనీ వాసులు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. అనంతరం తూర్పుపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ, వినాయకుడి గుడి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, గుబ్బల చంటి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర కమల వత్తుల వ్రతం


పసుపు కొమ్ములను దర్శించుకుంటున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు దంపతులు

పెనుగొండ: కార్తీక మాసం సందర్భంగా చెరుకువాడలోని ఉమాపార్వతి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో శనివారం గరిశ ధాన్య లక్ష పసుపు కొమ్ముల సహస్ర కమల వత్తుల వ్రతం వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకుడు శక్తేశ్వశ్వరరావు అర్చకత్వంలో పూజలు, అభిషేకంలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రభుత్వం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం గరిశ ధాన్యం, పసుపు కొమ్ములను స్వీకరించడానికి మహిళలు వేలాదిగా తరలివచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కూనపరెడ్డి లక్ష్మయ్యనాయుడు(నానాజీ), మల్లుల లక్ష్మీనారాయణ, కడలి గోవిందరాజు, కొవ్వూరి చిన్న పాల్గొన్నారు.

ఖాతాదారుల ఆదరాభిమానాలతో అభివృద్ధి


ఖాతాదారుల సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ రాంబాబు

పాలకొల్లు సెంట్రల్: బ్యాంకు అభివృద్ధి చెందాలంటే ఖాతాదారుల ఆదరాభిమానాలతో పాటు వారి సహాయ, సహకారాలు మెండుగా ఉండాలని కనకమహాలక్ష్మి కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అన్నారు. శనివారం బ్యాంకు రజతోత్సవాలు సందర్భంగా పట్టణంలోని కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంకులో ఖాతాదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో మెరుగైన విజయాలు సాధిస్తూ జాతీయ స్థాయిలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో అనేక అవార్డులు సాధించిందన్నారు. ఖాతాదారుల సహాయ సహకారాలతో బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో తీసుకువెళతామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్ సీపీ రామారావు, బంగారు పుల్లయ్య, ముఖ్య కార్యనిర్వహణాధికారి కె. శ్యామ్‌కిషోర్, రీజనల్ మేనేజర్ జి.సింహాచలం, శాఖ మేనేజర్ విజయ భీమ్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల రాజీతో సమయం, డబ్బు ఆదా


చించినాడలో మాట్లాడుతున్న నరసాపురం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్

యలమంచిలి: చిన్నచిన్న తగాదాల కేసుల్లో రాజీ పడితే సమయం, డబ్బు ఆదా అవుతాయని, ఏళ్ల తరబడి కోర్టులచుట్టూ తిరగడం వల్ల ప్రయోజనం ఉండదని నరసాపురం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చించినాడ సచివాలయంలో శనివారం మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ కేసుల్లో రాజీపడినంత మాత్రాన ఎవరూ తగ్గినట్టు భావించాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులు రాజీ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంఎ హమీద్, న్యాయవాదులు నక్కా ఆనందబాబు, డి.చాముండేశ్వరి, కె.శిరీష, ఇన్‌చార్జి సబ్ ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక వనసమారాధన

పెనుమంత్ర: పెనుమంత్ర రెడ్డి యూత్ లైన్స్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ పంచాయతీ చెరువుగట్టు వద్ద ఉన్న శ్రీదాసాంజనేయ స్వామి కొండాలమ్మ ఆలయం ఆవరణలో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు వైస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు సుధీర్‌రెడ్డి, యూత్ లైన్స్ కార్యక్రమం నిర్వాహక సభ్యులు కొవ్వూరి నాగ మోహన్‌రెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి హాజరవుతారని చెప్పారు.

అమ్మవారికి సమర్పించిన చీరల వేలం

పెనుగొండ: శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో భక్తులు సమర్పించిన చీరలను ఆదివారం, సోమవారాల్లో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీల కంఠం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకూ దేవాలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ ద్వారా సురక్షిత ప్రయాణం


డ్రాలో గెలుపొందిన ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

నరసాపురం: ఆర్టీసీ ద్వారా సురక్షిత ప్రయాణం సాగించవచ్చని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్న రెడ్డి అన్నారు. నరసాపురం బస్టాండ్ నుంచి వివిధ రూట్లలో ప్రవేశ పెట్టిన గిఫ్ట్‌స్కీమ్‌ను శనివారం బస్టాండ్‌లో నిర్వహించారు. దొడ్డిపట్ల, నిడదవోలు రూట్లలో ప్రయాణించిన ప్రయాణికుల పేర్లను డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. అనంతరం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో శిక్షణ పొందిన డ్రైవర్లు ఉంటారన్నారు. ప్రయాణీకుల భద్రతకు ఢోకా ఉండదని చెప్పారు. అలాగే ఆర్టీసీ విద్యార్థులకు, సీనియర్ సిటిజన్స్‌కు అనేక రాయితీలు అందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ టి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఆకివీడు: దుంపగడప గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి ఈ నెల 1 నుంచి కనిపించడంలేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. రొయ్యల కంపెనీలో పనిచేస్తున్న యువతి యథావిధిగా శుక్రవారం పనికివెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకోకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో శనివారం ఆమె తండ్రి ఫిర్యాదు చేశారని ఎస్సై వివరించారు.